పిల్లోనిగూడలో 14వ శతాబ్దపు స్తంభం

నగర శివారులోని మధుర అచ్చం పేట గ్రామంలో 14వ శతాబ్దపు స్తంభం బుధవారం బయటపడింది. విషయం తెలుసుకున్న ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ హైదరాబాద్ సీఈవో శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. శంషాబాద్ మండలం మధుర అచ్చంపేటలో 14వ శతాబ్దపు తెలుగుభాష, అక్షరాలతో రాయబడి ఉన్న స్తంభాన్ని పరిశీలించి పరిశోధన చేస్తామని తెలిపారు.

ఏదీ రుణమాఫీ!

మూడు సహకార సంఘాల పరిధిలో అరకొర మాఫీ

మాఫీ కోసం అడిషనల్ కలెక్టర్‌కు సహకార సంఘాల చైర్మన్ల వినతి

అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు

మేడ్చల్, జనవరి 29: ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత మాదే అని కాంగ్రెస్ ప్రభుత్వం బీరాలు పోతుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం విధించిన షరతుల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణమాఫీకి నోచుకోని ఎంతో మంది రైతులు ఉన్నారు. తమకెందుకు రుణమాఫీ కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ మండలంలో మూడు సహకార సంఘాల పరిధిలో అరకొర రుణమాఫీ జరిగింది. మండలంలో మేడ్చల్, డబిల్‌పూర్, పూడూరు వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. మేడ్చల్ సంఘం పరిధిలో రుణమాఫీకి 524 మంది అర్హత గల రైతులు ఉంటే కేవలం 398 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. ఇంకా 126 మందికి మాఫీ జరగాల్సి ఉంది. డబిల్‌పూర్ సహకార సంఘ పరిధిలో 661 మంది రైతులకు గాను 340 మందికి మాత్రమే మాఫీ జరిగింది. అంతేగాకుండా ఎస్‌బీఐ డబిల్‌పూర్ శాఖలో రుణం పొందిన రైతుల్లో 550 మంది రైతులకు గాను 150 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 400 మందికి మాఫీ కావాల్సినట్టు సమాచారం. పూడూరు సహకార సంఘ పరిధిలోని 1400 మంది మాఫీకి అర్హత ఉండగా అతి తక్కువగా 254 మందికి మాత్రమే జరిగింది. ఇంకా 1146 మందికి రుణమాఫీ జరగాల్సి ఉంది.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

సహకార సంఘాల చైర్మన్లు మూడు సహకార సంఘాల పరిధిలో ఉన్న అర్హుల జాబితాను రూపొందించి బుధవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టరేట్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అర్హులకు రుణమాఫీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇంత మందికి మాఫీ కాలేదా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టీఎస్‌సీఏబీ (తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్)కు రాసి పంపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సహకార సంఘాల చైర్మన్లు రణదీప్‌రెడ్డి, సద్ది సురేశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, మధు, దేవేందర్‌రెడ్డి, బ్రహ్మానందారెడ్డి, భూపాల్, చిన్నోళ్ల సంజీవ, సత్తయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కప్ 2025 బ్రోచర్ ఆవిష్కరణ

ఓయూలో కేసీఆర్ కప్ 2025 బ్రోచర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: తెలంగాణ అభివృద్ధి ప్రదాత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కేసీఆర్ కప్ 2025 బ్రోచర్‌ను ఓయూ గెస్ట్‌హౌజ్‌లో విద్యార్థి నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిర్వాహకుడు కొంపెల్లి నరేశ్ మాట్లాడుతూ ఈ ఏడాది సైతం కేసీఆర్ జన్మదినమైన ఫిబ్రవరి 17న కేసీఆర్ కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,000 నగదు బహుమతి అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు కోతి విజయ్, నవీన్‌గౌడ్, మంతెన మధు, పవన్‌కుమార్, అర్జున్, రాజేశ్, సందీప్, భరత్, సురేశ్, మల్లేశ్, పృథ్వీ, బస్వరాజ్, యశ్వంత్, దామోదర్, ప్రభాకర్, మహేశ్, సురేందర్, ప్రశాంత్, కమలాకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కళలకు సమగ్ర స్వరూపం గద్దర్

గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, తదితరులు

ముషీరాబాద్, జనవరి 29: సంప్రదాయ గ్రామీణ కళలకు సమగ్ర స్వరూపం గద్దర్ అని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతుల్లో భాగంగా ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గద్దర్ రాసిన పాట నాట్యం చేస్తూ, నర్తిస్తూ పాడే తీరు శిల్పంలా ఉంటుందన్నారు. మానవీయ సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప మనస్తత్వం గల వ్యక్తి అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్, భవానీ శ్రీనివాస్, కొల్ల సుధాకర్, ప్రభాకర్, వెంకటేశ్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ?

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కాచిగూడ: బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై మాట్లాడారు. కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలోనే మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారని చెప్పారు. పేదల కోసం సంక్షేమ పథకాలను చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీని త్వరలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారని, మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులందరూ బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి అధ్యక్షతన మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు మార జగదీశ్వర్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హుస్సేని ముజీబ్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ శాఖ సంచాలకులు ఉదయ్‌కుమార్, లక్ష్మీబాయి, లక్ష్మణుడు, రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, చిలక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేశ్‌నేత, సంఘం నాయకులు పాల్గొన్నారు.

– ఆర్కేపురం, జనవరి 29:

మంత్రి పొన్నంను కలిసిన నగర టీజీవో నేతలు

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీజీవో హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ట్రెజరర్ వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కలిసి సంఘం డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు.

విద్యార్థుల ప్రతిభ అమోఘం

విద్యార్థులకు సూచనలు అందిస్తున్న దర్శకుడు వేణు ఉడుగుల

చార్మినార్, జనవరి 29: సినిమా రంగంలో కొత్త ఆలోచనలకు ప్రయోగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని దర్శకుడు వేణు ఉడుగుల తెలిపారు. బుధవారం సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన బహుముఖ ప్రతిభ కార్యక్రమంలో ఆయన కాలేజీ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అసమాన ప్రతిభాపాటవాలు పుష్కలంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. సిటీ కాలేజీ సినిమా క్లబ్ విద్యార్థులు రూపొందించిన షార్ట్‌ఫిల్మ్ ప్రివ్యూను తిలకించిన ఆయన విద్యార్థుల సృజనాత్మకతను కొనియాడారు. తమకు అందుబాటులో ఉన్న పరికరాలతోనే విద్యార్థులు వివిధ కాన్సెప్ట్‌లను పరిగణలోకి తీసుకొని తమ మేధస్సుతో క్వాలిటీ షార్ట్‌ఫిల్మ్‌లను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇరువురి ప్రయాణం స్క్రిప్ట్ రూపొందించిన గిరీశ్, మురళిలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ కాలేజీ విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా భవిష్యత్తును మరింత సుందరంగా మలుచుకోవడాని ప్రోత్సాహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్లవ్‌దత్ శుక్లా, నీరజ, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, ఝాన్సీ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తి కంచర్ల

సుల్తాన్‌బజార్, జనవరి 29: జేఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియంలో జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.గంగాధర్, మాజీ వీసీ పేర్వారం పద్మావతి, జేఎన్‌టీయూ మాజీ రిజిస్ట్రార్ విఠల్‌రావు, వర్సిటీ మాజీ ప్రొఫెసర్లు పీరణ్, యశోధారావు, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఎస్పీఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాస్, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ ఎం.ఎల్. ఆనంద్, హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, బోధనా, బోధనేతర సంఘం అధ్యక్షుడు కె.మహిపాల్‌రెడ్డితో కలిసి దశరథ్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ జేఎన్‌టీయూను మూడు భాగాలుగా చేసే క్రమంలో నాటి సీఎం వైఎస్ఆర్ ఫైన్‌ఆర్ట్స్ కళాశాలను నిర్వీర్యం చేసేందుకు యత్నించారని, ఆ సమయంలో దశరథ్‌రెడ్డి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఏకం చేసి పోరాడారని వక్తలు కొనియాడారు. ప్రిన్సిపాల్‌గా గ్రామీణ విద్యార్థులకు మెరుగైన జ్ఞానంతో పాటు ఉపాధిని కల్పించి వారి జీవితాలో వెలుగులు నింపి చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్వర్లు, మాసూం అలీ, విష్ణువర్ధన్, కాంతారెడ్డి, కుమార్ బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 244 కేంద్రాలు

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి ఒడ్డన్న తెలిపారు. బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు ఉంటాయని, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు 88,298 మంది, ద్వితీయ సంవత్సరానికి 1,05,920 మంది విద్యార్థులు రాయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 244 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డి.రోహిణి, పర్యవేక్షకులు జహీరుద్దీన్, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అన్‌ఫ్రేమ్డ్ లైవ్స్ పుస్తకం ఆవిష్కరణ

అన్‌ఫ్రేమ్డ్ లైవ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జనవరి 29: అన్ ఫ్రేమ్డ్ లైవ్స్ పుస్తకం ప్రపంచంలోని అత్యుత్తమ పుస్తకాలలో ఒకటిగా నిలుస్తుందని సినీదర్శకుడు ప్రణయ్‌రెడ్డి వంగ అన్నారు. రచయిత ఫొటోగ్రాఫర్ జింక వరుణ్ రచించిన అన్ ఫ్రేమ్డ్‌లైవ్స్ పుస్తకావిష్కరణ సభ రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి వక్తలుగా సినీ రచయిత ప్రణయ్‌రెడ్డి వంగ, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, సినిమాటోగ్రాఫర్స్ పీజీ విందా, వంశీ పచ్చిపులుసు, డైరెక్టర్ శ్రీకాంత్ నాగోటి విచ్చేసి అన్‌ఫ్రేమ్డ్ లైవ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జింక వరుణ్ రచించిన అన్‌ఫ్రేమ్డ్‌లైవ్స్ పుస్తకం చాలా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సురేశ్ గంటి, హరిచంద్రప్రసాద్, శశికళ జాసన్, శశి కుకుంధాల, వినోద్‌పేట తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొఫైల్ రూపొందించేందుకు చర్యలు

జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్, జనవరి 29: రాష్ట్రంలోని పౌరులందరికీ సంబంధించిన హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత యాప్స్ దోహదపడతాయని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఎండీఆర్ మై డిజిరికార్డ్స్' పేరుతో ఏఐ ఆధారిత మెడికల్ సర్వీసెస్ యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం టెక్నాలజీని సరైన రీతిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఏఐ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతోందన్నారు. సమగ్ర హెల్త్ ప్రొఫైల్‌తో రోగికి సంబంధించిన వ్యాధి రిపోర్టులు, చికిత్స కోసం వాడుతున్న మందులు అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, దీనిద్వారా ఎక్కడకు వెళ్లినా నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాడ్యూర్ హాస్పిటల్ సర్వీసెస్ చైర్మన్ మోటూరి కృష్ణప్రసాద్, సీఈవో డాక్టర్ సరోజ్‌గుప్తా, సీవోవో డాక్టర్ క్రిస్ హంఫ్రయ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రవీంద్రభారతి, జనవరి 29: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. దేశ సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కొనసాగుతున్న హత్యాకాండను ఖండించారు. సుప్రీం కోర్టు సిట్టింగ్‌జడ్జితో ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'నక్సల్స్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాన్ని ఖండిద్దాం–ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం' నినాదంతో సెమినార్‌ను నిర్వహించారు. వక్తలుగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, సీపీఐ నాయకులు బోస్, నరసింహారావు ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా ఆదివాసీలను క్రూరంగా హత్యలు చేయడం, ప్రశ్నించే గొంతుకలను అణిచివేసి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కమ్యూనిస్టులను అంతం చేయాలనే లక్ష్యంతోనే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని దుయ్యబట్టారు. అటవీ సంపదను కార్పొరేటర్లకు దోచిపెడుతుందని, ప్రశ్నించే వారిని ఎన్‌కౌంటర్లు చేస్తుందని విమర్శించారు. తక్షణమే చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అబుజ్‌మడ్ ప్రాంతంలో కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక వాదులు ఏకమై దాడులను నిలిపివేసే వరకు ఉద్యమించాలని సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు.

రక్షణ కవచంలా ఎస్టీఎఫ్ సేవలు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్‌శాఖలో నేరాల నియంత్రణకు ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) సేవలు రక్షణ కవచంగా నిలుస్తున్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఎస్టీఎఫ్‌లో ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు అవార్డులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నాలుగు ఎస్టీఎఫ్ బృందాలు ఉన్నాయని బుధవారం పేర్కొన్నారు. 80 మందికి పైగా సిబ్బంది పనితీరుతో ఏడాదిలో 587 కేసులు నమోదు చేశామని తెలిపారు. నాలుగు ఎస్టీఎఫ్ టీమ్‌లు నిరుడు 1,123 కేజీల గంజాయి, 12 కేజీల యాష్ ఆయిల్, 12 గ్రాముల కొకైన్, 259 గ్రాముల ఎండీఎం డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. 1,175 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మద్యం, 36 లీటర్ల దేశీదారు, 869 కేజీల క్లోరో హైడ్రేడ్, 678 లీటర్ల కల్తీ మద్యం స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. 153 వాహనాలను కూడా సీజ్ చేసినట్టు ఆయన వెల్లడించారు.

పీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ పర్యావరణ నియంత్రణ బోర్డు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను బుధవారం పీసీబీ సభ్య కార్యదర్శి ఐఏఎస్ రవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈఈ బి.రఘు, జేసీఈఈ కృపానంద్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షులు మధుగౌడ్, జనరల్ సెక్రెటరీ నవీన్‌కుమార్, కోశాధికారి రఘునందన్, ఉపాధ్యక్షుడు వివేకానందమూర్తి, ఇతర సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. – సిటీబ్యూరో

క్యూఫ్లీట్‌కు 51 కార్లను విక్రయించిన ఆదర్శ మోటార్స్



సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ప్రముఖ మారుతి కార్ డీలర్ ఆదర్శ మోటార్స్ 51 కొత్త కార్లను క్యూ ఫ్లీట్ మేనేజ్‌మెంట్ కంపెనికీ విక్రయించింది. ఆదర్శ ఆటో మోటివ్ సీఈఓ నలినీకాంత్, మోటో బిజినెస్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సకావో హిరోషి, క్యూ ఫ్లీట్ సీఈఓ వినోద్‌కుమార్‌కు కార్ కీస్‌ను బుధవారం అందజేశారు. నలినీకాంత్ మాట్లాడుతూ క్యూ ఫ్లీట్‌కు గత సంవత్సరం వంద కార్లు అందజేశామని తెలిపారు. ఇప్పుడు మరో 51 కార్లను అనుకున్న సమయానికి అందజేసినట్టు ఆయన వివరించారు. క్యూఫ్లీట్ కంపెనీ ఆదర్శ ఆటోమోటివ్ నుంచి కొత్త వ్యాగన్ ఆర్ సీఎన్‌జీ కార్లను కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15ను జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కరాటే రాజునాయక్ డిమాండ్ చేశారు. దేశంలో బంజారాలు 15 కోట్ల మంది ఉన్నారని చెప్పారు. గొప్ప సంఘ సంస్కర్త సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించి, బంజారాల ఆకాంక్షలను గౌరవించాలని కోరారు. బంజారాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 12న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా కరాటే రాజునాయక్ హాజరై మాట్లాడారు. బంజారాల గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, బీసీ కమిషన్ల మాదిరిగా రాష్ట్రంలో బంజారా కమిషన్ ఏర్పాటుతో పాటు టీటీడీలో బంజారాలకు స్థానం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఇందల్ రాథోడ్, వెంకట్ బంజార, లోకేశ్‌నాయక్, రాజ్‌కుమార్‌నాయక్, రమేశ్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, రవీందర్‌నాయక్, సుధీర్‌నాయక్, మహేశ్‌నాయక్, నరేశ్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'

చిక్కడపల్లి, జనవరి 29: భవిష్యనిధి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ 30వ వార్షికోత్సవంలో 'పెన్షనర్స్ విజన్ బుక్–2 ఆవిష్కరణ బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ, ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ఎస్.మల్లేశం, పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ శివకుమార్ హాజరయ్యారు. సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని, నగదు రహిత వైద్యం అందించేందుకు తనవంతు కృషి చేస్తామని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగేందర్, కార్యదర్శి ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ ఇంక్రిమెంట్స్ అమలు చేయాలని పేర్కొన్నారు.

జేఈఈ విద్యార్థుల కోసం 'ఆకాశ్ ఇన్‌విక్టస్'

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): దేశంలోని సుమారు 500మందికి పైగా అత్యుత్తమ జేఈఈ ఫ్యాకల్టీతో తమ 25 బ్రాంచ్‌లలో ఆకాశ్ ఇన్‌విక్టస్ పేరుతో గేమ్ చేంజర్ జేఈఈ ప్రిపరేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఆకాశ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ, సిఈవో దీపక్ మహ్రోత్ర తెలిపారు. ఐఐటీలో సీటు సాధించే దిశగా సుమారు లక్ష మంది విద్యార్థులకు ప్రోగ్రామ్‌లో శిక్షణనివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక విధానం ప్రత్యేకమైన ఎంట్రన్స్ ద్వారా ఉంటుందని, ఇతర వివరాలకు 73037 59494 ఫోన్ నంబర్‌లో కానీ support.invictus@aesl.inలో సంప్రదించాలని దీపక్ కోరారు.